

ఊరించి.. ఉసూరుమనిపించి..!





'స్థానిక' పోరుకు బ్రేక్

- బీసీ రిజర్వేషన్లపై స్టే విధించిన హైకోర్టు
- ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత
- ఆశావహులకు తప్పని నిరాశ

జనగామ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'స్థానిక' పోరుకు బ్రేక్ పడింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతోపాటు గురువారం నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఇదే క్రమంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో 9ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇదే జీవో ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం జీవో 9ఆధారంగా ఎన్నికల వెళ్లేందుకు సిద్ధమైంది. ఇదే క్రమంలో సెప్టెంబరు 29న షెడ్యూల్ విడుదల చేయగా గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ తీర్పును వెలువరించింది. దీంతో ఎన్నికల నిర్వహణకు బ్రేక్ పడినట్లయింది.

ఎన్నికలు ఆలస్యం?

జీవో 9పై స్టే విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత ఏర్పడింది. హైకోర్టు తీర్పు ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆస్కారం ఉండదు. కాగా.. హైకోర్టు తీర్పుపై కౌంటర్ దాఖలు చేసేందుకు నాలుగు వారాల గడువు ఉంది. కాగా.. దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసి కోర్టులో గెలిచి ఎన్నికలు నిర్వహిస్తుందా? లేదా సుప్రీంకోర్టులో తేల్చుకుంటుందా? అన్న చర్చ జరుగుతోంది. ఎన్నికలు ఇప్పటికిప్పుడు జరగాలంటే పాత రిజర్వేషన్ల ప్రాతిపదికన వెళ్లాల్సి ఉంటుంది. అలా చేస్తే బీసీలు సైతం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఇన్ని తర్జనభర్జన నడుమ స్థానిక సంస్థల ఎన్నికలె కచ్చితంగా ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని రాజకీయ పార్టీలు నాయకులు భావిస్తున్నారు.

ఆశావహులకు నిరాశ!

ఎన్నికలు వాయిదా పడడంతో జిల్లావ్యాప్తంగా ఆశావహుల్లో నిరాశ నెలకొంది. ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు వివిధ పార్టీలకు చెందిన ఆశావహులు సిద్ధపడ్డారు. ఇప్పటికే తాము బరిలో ఉంటున్నామంటూ ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని సైతం కొందరు ప్రారంభించారు. రాజకీయ పార్టీలు సైతం బీఫారాల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు సైతం స్వీకరించింది. జిల్లాలో కొన్ని చోట్ల పార్టీ అభ్యర్థుల ఖరారు కూడా జరిగింది. తీరా నామినేషన్ వేద్దామనుకునే సమయానికి స్టే విధించడంతో నిరాశ ఎదురైంది. కాగా.. కోర్టు స్టే నేపథ్యంలో రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు నిరాశ చెందగా, ప్రతికూలంగా వచ్చిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లలో మారితే తమకు కలిసి వస్తుందనే అభిప్రాయం కొంతమందిలో వ్యక్తమవుతోంది.

నామినేషన్లు నిల్!

- ముందుకు రాని అభ్యర్థులు
- సందిగ్ధత నేపథ్యంలో వెనకడుగు

జనగామ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి తొలిరోజు (గురువారం)ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో విచారణ ఉండడంతో అభ్యర్థులు కాస్త వెనకడుగు వేశారు. కోర్టు తీర్పు తర్వాత నామినేషన్లు వేద్దామనే ధోరణితో అభ్యర్థులు ఉండిపోయారు. నామినేషన్లు దాఖలు చేశాక ఎన్నికలపై స్టే విధిస్తే అంతా వట్టిదయిపోతుందన్న ఆలోచన అభ్యర్థుల్లో నెలకొంది. దీంతో నామినేషన్ల దాఖలుకు ఎవరూ ముందుకు రాలేదు. జనగామ జిల్లాలో మొదటి విడత కింద జిల్లాలోని దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, లింగాలఘనపురం, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల పరిధిలోని 70ఎంపీటీసీ స్థానాలకు, ఆరు జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లను స్వీకరించేందుకు ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సందర్శించి రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

నామినేషన్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

- పొరపాట్లకు తావులేకుండా నామినేషన్లను పూర్తి చేయాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



లింగాలఘణపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లింగాలఘణపురం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే మండలాల్లోని ప్రతీ నామినేషన్ కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం లింగాలఘణపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీల నామినేషన్ కేంద్రాన్ని, నామినేషన్ల ప్రక్రియ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా నోటీస్ ప్రదర్శించిన విధానాన్ని, హెల్ప్‌డెస్క్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు వారి విధులపై అవగాహన పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఆర్వో, ఏఆర్వో ఏమేమి చెక్ చేయాలో క్షుణ్ణంగా కలెక్టర్ వివరించారు. మొదటి విడతలో ఎన్నికలు జరిగే చిల్పూరు, కొడకండ్ల, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల, లింగాలఘణపురం మండలాల్లో గురువారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ప్రతీ నామినేషన్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థులకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేసి సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నామినేషన్ పత్రాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అవసరమైన సలహాలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట రిటర్నింగ్ అధికారి హతీరాం, తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో రఘురామకృష్ణ ఉన్నారు. కాగా కలెక్టర్ సందర్శించి వెళ్లిన తర్వాత కొద్దిసేపటికి రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు శ్యాంలాల్, ఎన్నికల వ్యయపరిశీలకులు మానస సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు.

- జనగామ కల్చరల్(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కాగా ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ కోరారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయాన్ని పరిశీలించి, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ ప్రక్రియకు చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మాధురిషా, డిప్యూటీ సీఈవో సరిత పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా
కలెక్టర్‌కు అవార్డు

జనగామ కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఉత్తమ అవార్డును గురువారం అందుకున్నారు. ఆర్టీఐ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించినందుకు సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. జిల్లాకు వివిధ అంశాలలో అవార్డులు వస్తున్నందున కలెక్టర్‌సారథ్యంలో వివిధ శాఖల అధికారులు పనిచేయడం అభినందనీయమని గవర్నర్ ప్రశంసించారు.



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి విక్రమ్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయమూర్తి విక్రమ్

తరిగొప్పుల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత పూర్తి అగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయమూర్తి విక్రమ్ సూచించారు. స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం తరిగొప్పుల మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఎస్సై గుగులోతు శ్రీదేవి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో రీల్స్ పోస్టు చేయడంతో ఆ ఫోటోలను సైబర్ నేరగాళ్లు ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ చేస్తున్నారని, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తి సూచించారు. మైనర్లు లైంగిక వేధింపులకు గురవుతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో నర్మెట సీఐ అబ్బయ్య, భవిత సెంటర్ అడ్వకేట్స్ దయామణి, సుధారాణి, ఎంఈవో నెల్లుట్ల జానకి, పాఠశాల ప్రత్యేకాధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ కోల్పోతున్న ప్రభుత్వం

- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం
- నేను పార్టీ మారుతున్నాననడం అబద్ధం
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

జనగామ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా అత్యంత తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదరణను కోల్పోతోందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఆలోచన చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. గతంలో ఇందిరాగాంధీకి హారతి పట్టిన ప్రజలే ఎమర్జెన్సీ సమయంలో ఓడగొట్టారని, దాని తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు అద్భుతంగా గెలిపించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ది ప్రజల ముందుకు రాలేని పరిస్థితి అని ఎద్దేవా చేశారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయభేరి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సానుభూతి, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, కాంగ్రెస్‌పై మైనారిటీల్లో ఉన్న వ్యతిరేకత, సెటిలర్ల ఓట్లు బీఆర్ఎస్‌కు అనుకూలిస్తాయన్నారు. తాను పార్టీ మారుతున్నానని జరుగుతున్న ప్రచారాలు అవాస్తవమని పొన్నాల స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గాడిపల్లి ప్రేమలతారెడ్డి, పసుల ఏబెల్, బండ యాదగిరిరెడ్డి, తాళ్ల సురేశ్‌రెడ్డి, బైరగోని యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.



జఫర్‌గడ్ మండలంలో ఉపాధి కూలీలు (ఫైల్)

ఉపాధిలో పారదర్శకత

- అవకతవకల నివారణకు కొత్త మార్గదర్శకాలు
- ఉపాధి కూలీలకూ ఈకేవైసీ తప్పనిసరి
- ఇక పక్కాగా కూలీల హాజరు
- రెండు పూటలా ఫొటోల అప్‌లోడ్
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ
- 56,707 మంది కూలీల ఈకేవైసీ పూర్తి
- ప్రస్తుతం యాక్టీవ్‌లో 77,801 జాబ్ కార్డులు
- 1,28,497 మంది కూలీలు

జఫర్‌గడ్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కోట్లాది రూపాయల నిధులతో చేపడుతున్న ఈజీఎస్ పనుల్లో అక్రమాలు, అవతవకలను నివారించడానికి ఏటా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఏడాదికోసారి సామాజిక తనిఖీ నిర్వహిస్తూ ప్రజా వేదికల్లో వివరాలను వెల్లడిస్తున్నా.. అవకతవకలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. వీటిని అడ్డుకోవడమే లక్ష్యంగా తాజాగా ఉపాధి కూలీల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా మార్పులు చేసింది. జాతీయ మస్టర్ నిర్వహణ విధానం (ఎన్ఎంఎంఎస్) ద్వారా ఆన్‌లైన్‌లో కూలీల హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. బీటా వర్షన్‌లో ఈకేవైసీ చేసుకుంటేనే పని వేతనాన్ని అందించేలా మార్పులను తీసుకుస్తున్నారు. ఈ విధానం అమలులో భాగంగా జాబ్ కార్డులోని కూలీలందరూ విధిగా యాప్‌లో తమ ఫేస్, ఐరిస్ చిత్రాల అప్‌లోడ్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఈకేవైసీ ప్రక్రియను ఈనెల నుంచి కొనసాగిస్తున్నారు. కూలీల ఫేస్, ఐరిస్ ఫొటోలను క్షేత్రస్థాయి ఉపాధి ఉద్యోగ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేసి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈనెల ఒకటో తేదీనుంచే ఈ ప్రక్రియ సాగుతోంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 1,17,772 జాబ్ కార్డులు ఉండగా, ప్రస్తుతం 77,801 జాబ్ కార్డులకు చెందిన 1,28,497 మంది కూలీలు ఉపాధి పనుల్లో భాగస్వాములవుతున్నారు.

56,707 మంది ఈకేవైసీ పూర్తి..

జిల్లాలో ఇప్పటి వరకు 56,707 మంది ఉపాధి కూలీలకు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. బచ్చన్నపేట మండలంలో 3,995 మంది, చిలుపూర్‌లో 4,207, దేవరుప్పులలో 7,417, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 4,187, జనగామలో 5,045, కొడకండ్లలో 5,407, లింగాలఘనపురంలో 6,073, నర్మెటలో 2,556, పాలకుర్తిలో 3,740, రఘునాథ్‌పల్లిలో 5,935, తరిగొప్పులలో 3,419, జఫర్‌గడ్‌లో 4,726 మంది కూలీల చొప్పున ఈకేవైసీ ఫేస్ రికగ్నేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

ముఖ గుర్తింపు తప్పనిసరి...

ఉపాధి హామీ పథకం కూలీల హాజరు, వేతనాల చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈనెల ఒకటో తేదీ నుంచి కూలీల ముఖ గుర్తింపు ప్రక్రియ (ఈకేవైసీ) చేపట్టింది. కూలీలకు వేతనాలు చేతికందాలంటే ఈకేవైసీ తప్పనిసరి చేసింది. యాప్ వినియోగంపై ఉపాధి క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా జాబ్ కార్డులు కలిగిన ఉపాధి కూలీల ముఖం లేదా ఐరిస్ ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లో కోడ్ నమోదు చేస్తే ఓపెన్ అవుతుంది. ఈ విధానం అమలు ద్వారా కూలీల ఆధార్ అనుసంధానంతో ఆన్‌లైన్ వివరాలు సరిపోతేనే కూలీలు పని చేయాల్సి ఉంటుంది.

లోపాలకు చెక్ పెడుతూ..

ఇన్నాళ్లు కూలీల వేతనాల చెల్లింపులో పారదర్శక త లోపించడంతో పని చేసిన కూలీలకన్నా అధికంగా డబ్బులు చెల్లించారనే ఆరోపణలున్నాయి. మస్టర్ల లో ఎంత మంది పేర్లను నమోదు చేస్తే అంత మం దికి డబ్బులు చెల్లించారు. కేవలం మస్టర్లను ప్రామా ణికంగా చేసుకుని వేతనాల చెల్లింపుల ప్రక్రియ చేపట్టారు. దీంతో చాలా గ్రామాల్లో పని చేసిన కూలీల (మిగతా 6వ పేజీలో)

ఈకేవైసీ పక్కా అమలుకు చర్యలు : వసంత, డీఆర్డీవో, జనగామ



కేంద్రం ఆదేశాల మేరకు ఉపాధి పథకంలో పని చేసే కూలీల ముఖ గుర్తింపు కోసంఈకేవైసీ ప్రక్రియను పక్కాగా అమలుకు చర్యలు చేపట్టాం. ఈ విధానంతో ఖచ్చితమైన హాజరుతోపాటు బినామీలు, అవకతవకలను నివారించవచ్చు. కూలీలు, పనుల్లో పారదర్శకత ఏర్పడుతుంది. ప్రత్యేక యాప్‌లో క్షేత్ర స్థాయి ఉద్యోగ సిబ్బంది కూలీల ముఖ చిత్రాల అప్‌లోడ్ ద్వారా వివరాలను నమోదు చేస్తారు. ఈకేవైసీ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. ఈ విధానంతో ఇక నుంచి నిబంధనల ప్రకారం కూలీలకు డబ్బులు చెల్లిస్తారు. జాబ్ కార్డులు కలిగిన కూలీలు విధిగా యాప్‌లో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి.

ఆరుగురికి ప్రాణంపోసి..
తాను కన్నుమూసి..



గాదె యుగంధర్ (ఫైల్)

- హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రేయిన్ డెడ్
- అవయవాల దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు
- మృతుడు జనగామ జిల్లా వాసి
- మండేలగూడెంలో యుగంధర్‌కు కన్నీటి వీడ్కోలు

5

పంటలకు పందుల బెడద

● ప్రజలకు కోతుల దడ.. ● పత్తి, వరి పంటలను నాశనం చేస్తున్న అడవి పందులు
● గ్రామాల్లో వానరాలతో ప్రజల బెంబేలు ● ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలంటున్న అన్నదాతలు

కాటారం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నదాతల అగచాట్లు అన్నీ ఇన్నీ కావు.. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికంది అమ్ముకునే దాకా గ్యారంటీ లేని పరిస్థితి..ఓ వైపు ఎడతెగని వర్షాలు, చీడపీడలతో పంటల దిగుబడులపై ప్రభావం చూపుతాయని రైతులు ఆందోళన చెందుతుంటే అడవి పందులు, కోతులు పంటలను నాశనం చేస్తూ రైతులకు నష్టం కలుగజేస్తున్నాయి. పందుల దాడితో ఒక్కోసారి రైతుల ప్రాణాల మీదికి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు జంతువులు కలిగించే నష్టంతో అన్నదాతలు కుదేలయ్యే పరిస్థితి దాపురించింది. తాము వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండిస్తున్న పంటలను ఎలా కాపాడుకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అడవిపందులతో వరి, పత్తి పంటలు ధ్వంసం..

అటవీ ప్రాంతం దగ్గరగా ఉన్న పొలాలు, చేలు, గ్రామాల సమీపంలో ఉన్న పంటలతో పాటు ప్రధానరహదారికి పక్కన ఉన్న పత్తి చేన్లను సైతం అడవిపందులు ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి చేనులో 20శాతం పంటను పందులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పందుల దాడిలో కొందరు చనిపోయిన, తీవ్రంగా గాయపడ్డ సంఘటనలున్నాయి. దీంతో పంట పొలాల వద్దకు వెళ్లాలంటేనే రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

రైతులకు భారీగా నష్టం..

డివిజన్‌లో సుమారు 45,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పత్తి సాగయింది. ఇందులో గత కొద్ది రోజుల నుంచి అడవి పందుల వల్ల వందల ఎకరాల్లో పత్తి దెబ్బ తిన్నదని, డివిజన్ వ్యాప్తంగా సుమారు రూ.2కోట్లకు పైగా విలువ చేసే పంట పందుల దాడిలో పాడైందని ఆ మేరకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి చేలు, వరి పొలాలను పందులు పాడు చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వీరాపూర్, గూడూరు, మేడిపల్లి, జగ్గయ్యపల్లి, గోపాల్‌పూర్, రేగులగూడెం, దేవరాంపల్లి, గంగారం, భూడిదపల్లి, గుండ్రాత్‌పల్లి, నస్తూరుపల్లి, ధన్వాడ, గుమ్మళ్లపల్లి తదితర గ్రామాల పరిధిలో పంటలను పందులు తొక్కి పాడు చేస్తున్నాయి. పందుల బెడదను తప్పించడానికి కొంతమంది రైతులు పాత చీరెలను కొనుగోలు చేసి చేన్ల చుట్టూ కడుతుండగా మరి కొందరు రైతులు గట్లపై కర్రలు పాతి సెంట్రింగ్ వైర్‌ను కడుతున్నా ఆశించిన ఫలితాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ధన్వాడ వద్ద వరి పొలానికి రక్షణగా కట్టిన చీరలు


గూడూరులో పందులు పాడు చేసిన పత్తి చేను

వానరాల హల్‌చల్..

అడవులు దట్టంగా ఉన్నా కూడా వానరాలు గ్రామాల్లోనే సంచరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇండ్లపై పెంకులు లేకుండా చేస్తున్నాయని, ఇంట్లో సామాగ్రికి రక్షణ కరువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరట్లో కూరగాయలు లేకుండా చేసున్నాయని వారు వాపోతున్నారు. మండలంలోని కాటారం, గారెపల్లి, చింతకాని, కొత్తపల్లి, రేగులగూడెం, దేవరాంపల్లి, గంగారం, శంకరంపల్లి, కొత్తపల్లి, బస్వాపూర్, ధన్వాడ, నస్తూరుపల్లి తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. పలువురు కోతుల నుంచి రక్షించుకోవడానికి పరుగెత్తి కిందపడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి అడవి పందులు, కోతులను నియంత్రించడంతో పాటు పాడైన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


మేడారం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో స్థలం పరిశీలిస్తున్న సీఐ దయాకర్

పోలీసుల వసతి కోసం స్థల పరిశీలన

తాడ్వాయి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని మేడారంలో 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరగబోయే సమ్మక్క సారలమ్మల మహా జాతరలో భక్తుల భద్రత సేవలకు వచ్చే పోలీసు సిబ్బందికి వసతి ఏర్పాట్లు, మెస్ సౌకర్యం, కోసం స్థలాలను పస్రా సీఐ దయాకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, రిజర్వ్‌డు ఇన్ స్పెక్టర్(ఆర్‌ఐ) స్వామి పలువురు స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి మేడారం పరిసరాల్లో తిరిగి పరిశీలించారు. కాగా పలు ప్రాంతాల్లో రైతులు, స్థల యజమానులతో మాట్లాడి ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

నర్మెట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం గండిరామవరంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముక్కెర లావణ్య(32), సంపత్ దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. సాగు, పిల్లల చదువులు కోసం ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి సిద్దిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


లావణ్య (ఫైల్)

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జఫర్‌గడ్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలోని తిడుగుకు చెందిన మాదారపు లక్ష్మయ్య (78) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... లక్ష్మయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 26న ఇంట్లో బాత్రూంకు వెళ్లి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. లక్ష్మయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలపై లోకల్ కోర్టులు

రాంనగర్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎన్పీడీసీఎల్ పరిధిలోని పలు సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎన్.వి.వేణుగోపాల్ చారి తెలిపారు. హనుమకొండ సర్కిల్‌లోని నయీంనగర్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న యాదవనగర్, గోపాల్‌పూర్, నయీంనగర్ సెక్షన్ పరిధిలో ఉన్న వినియోగదారుల కోసం శుక్రవారం నిర్వహిస్తున్న లోకల్ కోర్టును సంబంధిత వినియోగదారులు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అదే విధంగా ఈ నెల 17న భూపాపల్లి జిల్లాలోని రేగొండ సబ్‌స్టేషన్ ఆవరణంలో, 18న వరంగల్ సర్కిల్‌లోని అరెపల్లి సబ్‌స్టేషన్ ఆవరణంలో లోకల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్.వి.వేణుగోపాల్ చారి తెలిపారు. లోకల్ కోర్టుల్లో సీజీఆర్ఎఫ్ మెంబర్ టెక్నికల్ కె.రమేశ్, మెంబర్ ఫైనాన్స్ ఎన్. దేవేందర్, ఇండిపెండెంట్ మెంబర్ రామారావు పాల్గొంటారన్నారు.

ఉద్యోగులకు జాప్యం లేకుండా సేవలందించాలి

ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి

కృష్ణకాలనీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు జాప్యం లేకుండా సేవలందించాలని ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి సూచించారు. గురువారం సింగరేణి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అన్ని గనులు, సంక్షేమాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు,విశ్రాంత ఉద్యోగులు టెర్మినల్ బెనిఫిట్స్, ఉద్యోగుల గృహ రుణాల రాయితీ, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు తదితర సంక్షేమ పథకాలు, ఉద్యోగుల గైర్హాజరుపై చర్చించారు. ఫైళ్లు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి వెనువెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ క్రాంతికుమార్, గుండు రాజు, అన్ని గనుల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ గాలి వీస్తోంది

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ గాలి వీస్తోందని, స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాకీ కార్డు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో 420హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం, మహిళలకు రూ. 2,500 నగదు, దివ్యాంగులకు నెలకు రూ. 6 వేలు చొప్పున పింఛన్ బాకీ ఉన్నారని అన్నారు.

అలాగే పదేళ్ల తర్వాత యూరియా కొరత ఏర్పడడంతో రైతులు నిద్రహారాలు మాని క్యూలైన్లో నిలుచున్న పరిస్థితి ఉందన్నారు. ఉపాధి కూలీలకు ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేలు, ఇలా అనేక అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని అన్నారు. నియోజకవర్గంలో దయాకర్‌రావును ఎందుకు ఓడగొట్టామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. మళ్లీ ప్రజలు బాగా ఆలోచిస్తున్నారని, పోటీ చేసే ప్రతి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తారని అన్నారు. అనంతరం మండలంలోని లక్ష్మీనారాయణపురం, బీక్యానాయక్ పెద్దతండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కుండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి, శ్రీనివాసరావు, వేణు, అశోక్‌రెడ్డి, కర్నాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


బాకీకార్డు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

నేడు తెలంగాణ బంద్‌కు బీసీ రాజ్యాధికార పార్టీ పిలుపు


మాట్లాడుతున్న టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్

హనుమకొండ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9ని నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ బంద్‌కు తెలంగాణ బీసీ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) పిలుపు ఇస్తున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ తెలిపారు. గురువారం హనుమకొండలో టీఆర్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదం రజినీకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బంద్ కొనసాగుతుందని టీఆర్‌పీ కార్యకర్తలు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, బీసీఉద్యోగులు, న్యాయవాదులు, డాక్టర్లు, ప్రజా సంఘాలు, మేధావులు బంద్‌కు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఆర్‌పీ నాయకులు పెండెల సంపత్ పటేల్, జంగిలి శ్రీనివాస్, పోలు రాజు, పల్లకొండ చందు, మాదం నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు పోక్సో కోర్టు సంచలన తీర్పు

నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

ఏటూరునాగారం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ములుగు పోక్సో సెషన్స్ కోర్టు గురువారం మరోసారి తేల్చి చెప్పింది. ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ 17/23 కేసుకు సంబంధించి, నిందితుడు మంతెన రామయ్య అలియాస్ రాములు(43) అనే వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 12వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన కేసు వివరాలు ప్రకారం.. మండలం పరిధిలోని గుర్రంపేట గ్రామానికి చెందిన కూలీ మంతెన రామయ్య , అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేరానికి సంబంధించి బాధితురాలి తల్లి అడ్డూరి ఉదయ ఫిర్యాదు మేరకు ఏటూరునాగారం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్లు 448, 376ఏబీ, పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎం), ఆర్/డబ్ల్యూ కింద అభియోగాలు మోపారు.

అయితే, ఈ కేసును గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై ఇంద్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం అప్పటి ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ ఈ కేసును విచారించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పర్యవేక్షణలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజకుమార్, కోర్ట్ కానిస్టేబుల్ మౌనిక సాక్షులను కోర్టులో సమర్థవంతంగా ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన ములుగులోని స్పెషల్ పోక్సో కోర్ట్ కమ్-ప్రిన్సిపాల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.వీ.పీ సూర్యచంద్రకళ, నిందితుడు మంతెన రామయ్య అలియాస్ రాములు నేరం చేసినట్లు నిర్ధారించి, శిక్షను ఖరారు చేశారు.

సిట్టింగ్ వాలీబాల్ భారత కెప్టెన్‌గా ప్రశాంత్



వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు అమెరికాలోని ఇండియానా రాష్ట్రం ఫోర్టువేన్లో నిర్వహించనున్న వరల్డ్ సిట్టింగ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్న భారత జట్టు కెప్టెన్‌గా వరంగల్ జిల్లా మైలారం గ్రామానికి చెందిన గాడిపల్లి ప్రశాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయవంత్‌జీ అమరవార్ గురువారం నియామక ఉత్తర్వులను ఒక ప్రకటన ద్వారా జారీ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన గాడిపల్లి ప్రశాంత్.. అంగవైకల్యంతో బాధపడుతునే ఆటల్లో ఉన్న ఆసక్తితో పదేళ్లుగా సిట్టింగ్ వాలీబాల్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను విశ్వవాప్తం చేస్తున్నాడు. 2023లో ఈజిప్ట్‌లోని కైరోలాలో జరిగిన వరల్డ్ పారా వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతి నిధ్యం వహించిన భారత పురుష జట్టుకు ప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించారు.

ఈ మేరకు ప్రశాంత్ మాట్లాడుతూ.. అంగవైకల్యం, పేదరికం ఆటలకు అడ్డుకాదని, తనకు నచ్చిన సిట్టింగ్ వాలీబాల్‌ను ఎంచుకొని ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో పాల్గొన్నానన్నారు. అమెరికాలో నిర్వహిస్తున్న వరల్డ్ సిట్టింగ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న భారత జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేసిన పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయవంతజీ అమరవార్, రాష్ట్ర కమిటీ సభ్యులకు, కోచ్‌లకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో జయశ్రీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టుబీ వర్సిటీ కంపుటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకు రాలు జయశ్రీ కుమ్మరి డాక్టరేట్ సాధిం చారు. ఈ మేరకు గురువారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి జయశ్రీకి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'హెచ్‌డీపీఎఫ్: ఏ హైబ్రీడ్ ఫీచర్ సెలక్షన్ మెథడ్ ఫర్ హార్ట్ డిజిస్ పిరియాక్షన్ ప్రేమ్ వర్క్స్ యూజింగ్ మిషన్ క్లీనింగ్ ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినం దుకు డాక్టరేట్ సాధించారు. సీడీసీ టూబీ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు జి.శంకర్‌లింగం, ఎన్.సతీశ్‌కుమార్‌ల సంయుక్త పరిశోధనలో జయశ్రీ పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన జయశ్రీని వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు విభాగం ప్రొఫెసర్లు అభినందించారు.

42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము లేకనే 42 శాతం రిజర్వేషన్లు అంటూ బడుగు, బలహీన వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని ఆయన నివాసంలో చల్లా మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు కూడా అదే మోసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచల య్యాయన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వల్ల ఇప్పటికే గ్రామాలలో ఆశావహులు ఖర్చుల పాలయ్యారని, వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 420 హామీల తరహాలోనే 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాలను భాగస్వామ్యం చేసి ఢిల్లీ వేదికగా జరుగాల్సిన పోరాటాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గల్లీలో చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల చేతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు.


మాట్లాడుతున్న ధర్మారెడ్డి

మట్టి టిప్పర్ల సీజ్


పోలీసులు పట్టుకున్న టిప్పర్

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను పోలీసులు సీజ్ చేసి మంగళవారం రాత్రి స్టేషన్‌కు తరలించారు. ఇప్పగూడెం శివారు నుంచి రోజుల తరబడి అధికలోడ్‌తో టిప్పర్లు మట్టిని తరలిస్తుండడంతో రోడ్లు దెబ్బతినడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఐలు శ్రీకాంత్, సతీష్‌ల ఆధ్వర్యంలో మట్టి టిప్పర్లను వేబ్రిడ్జి పై తూకం వేసి స్టేషన్‌కు తరలించారు. నిబంధనల మేరకు ఉండాల్సిన మట్టి కంటే ఒక్కో టిప్పర్లో 10 టన్నుల మట్టి ఎక్కువగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.

తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా టిప్పర్లు పట్టుకోవడం జరిగిందని, ఒకటి రెండు రోజుల్లో అధిక లోడ్ మట్టికి ఫైన్ విధించి కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

12న ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపు

హాజరుకానున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ప్రజల సౌకర్యార్థం ఈ నెల 12 న(ఆదివారం) ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపును నిర్వహించనున్నారు. మండలం పరిధిలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన తుమ్మ కోమల-సాయిరెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు పెద్ద కుమారుడు వరంగల్‌లోని కేఎంసీలో పీడీగా తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, రెండో కుమారుడు శ్రీధర్‌రెడ్డి పాత్రికేయ వృత్తిలో, మూడో కుమారుడు సంజీవరెడ్డి రాజకీయ రంగంలో ఉన్నారు. వీరి తల్లిదండ్రులు, కుమారుడైన తుమ్మ జయసింహారెడ్డి దివంగతులు కావడంతో వారి జ్ఞాపకార్థం ఊరికి ఏదైనా చేయాలనే తపనతో గతంలో చిన్నబోయినపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలకు ఉచిత వైద్యం అందించేందుకు వైద్యశాల, సురక్షిత తాగు నీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్, స్వర్గ రథం, ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేశారు.

ఇందులో భాగంగా నే తాజాగా, ఈనెల 12న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చిన్న బోయినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ వైదులతో ఈ సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపును నిర్వహించ నున్నట్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంజీవరెడ్డిలు తెలిపారు. మహిళలకు చీరలు, పాఠశాల విద్యార్థులకు దుస్తులు, నోట్‌బుక్స్, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

హాజరుకానున్న ప్రముఖులు..

ఈ ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, జిల్లా ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నంద కుమార్‌రెడ్డి, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఐఎంఏ డాక్టర్ ఎ.ఎస్ నాగార్జునరెడ్డి, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సంధ్య అనిల్, ములుగు అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, కాసం గ్రూప్ చైర్మన్ కాసం నమశివాయ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

తొర్రూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొర్రూరు మండలం మడిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వెల్పుల సురేష్ (35) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన సురేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. సాయంత్రం ఇంటి పక్క వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఆ సమయంలో భార్య రాజేశ్వరి ఊర్లో లేదని గ్రామస్థులు తెలిపారు. సురేష్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ఉపేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7120	5300
మక్కలు	1802	1521
కందులు	6029	3022
పెసళ్లు	4522	3022
పల్లికాయ (సూక)	6500	3500
పల్లికాయ (పచ్చిది)	4000	2400
పసుపు (కాడి)	11209	7889
పసుపు (గోల)	10309	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16800	12000
యూఎస్341ఏసీ	16300	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



WANTED

★ Telecallers in Education Sector Salary 6,000-8,000/- Full/Part Time, work from Office. Incentives 5,000 to 10,000/- per Addmission. Cont :- 9908432153

AJW-6654

PLOT FOR SALE

★ వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కి కేవలం 1 కి.మీ.దూరంలో KUDA Layout Plots అమ్మకానికి కలవు. వెంటనే ఇండ్లు కట్టుకోవచ్చు. బ్యాంక్ లోన్ సౌకర్యం కలవు. సంప్రదించండి: 9573689941

AJW-243520

COURIER SERVICES

★ [illegible] Abroad Pickle Packing Service Available. Cell: 9494934870, 9000458971

AJW-243468

PLOT FOR SALE

★ KUDA Layout Plots హసన్‌పర్తి నుండి 1 కి.మీ దూరంలో జయగిరికి వెళ్లే డాంబర్ రోడ్డుకు వున్న ప్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును. సంప్రదించండి: 9281141001

AJW-4159

VEHICLE FOR SALE

★ TS-05-UB-5049, TATA LPT 3118 TC Model - 2016, TS-03-VC-3318 Ashok Leyland U-2518 Model 2018 వాహనములు ది. 13-10-25న ఉదయం గం. 10-30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్. సెల్ : 63024 90793, 79815 80430

AJB-835

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677

వరంగల్
9949638376
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9949638376

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232



మహబూబాబాద్ రైల్వేస్టేషన్ (ఫైల్)

మానుకోటలో మెగా రైల్వే డిపో



డోర్నకల్ రైల్వేస్టేషన్ (ఫైల్)

మంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు అంతా..

కేంద్ర మంత్రి నుంచి జిల్లాకు చెందిన రాష్ట్ర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల వరకు ఈ మెగా రైల్వే మెయింటెన్స్ డిపో మంజూరుకు కృషిచేసిన వారే ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నాయకుల విజ్ఞప్తి మేరకు కేంద్రంలోని అధికార పార్టీకి చెందిన మంత్రి బండి సంజయ్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ కేంద్రానికి లేఖలు రాశారు. మరోవైపు మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, రైల్వే ఉద్యోగ సంఘ నాయకులు కూడా ఇక్కడ పీవోహెచ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తూ వినతులు ఇచ్చారు. వినతుల్లో కోరిన వాటికంటే అదనంగానే ఇక్కడ మంజూరుకావడంతో అటు కేంద్ర బీజేపీ, ఇటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.908.15 కోట్లు కేటాయించిని రైల్వేశాఖ
- డోర్నకల్‌కు రూ.48 కోట్లు కేటాయింపు
- ప్రత్యక్షంగా 1000 మందికి ఉపాధి
- పరోక్షంగా 5వేల మందికి ఆదరవు

మహబూబాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా ప్రయత్నిస్తే సాధ్యం కానిద్దంటూ ఏదీ లేదని మహబూబాబాద్ ప్రాంతానికి తాజాగా మంజూరైన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు రుజువు చేస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా అందరూ ప్రజాప్రతినిధులు, నాయకులు చేసిన ప్రయత్నాలు ఈ ప్రాంత నిరుద్యోగుల, ప్రజల కలలను సాకారం చేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రం నుంచే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయిన తెలంగాణలో రైల్వేశాఖకు సంబంధించిన పలు అభివృద్ధి పనుల మంజూరీకి స్వరాష్ట్రం సిద్ధించిన దాదాపు దశాబ్దాకాల అనంతరం బీజం పడింది. సరుకు రవాణా నిర్వహణ సౌకర్యాల పెంపుదల రైల్వే వ్యాగన్లు, ఇంజన్లు మరమ్మతుల కోసం దక్షిణ మధ్యరైల్వే మానుకోటకు ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ ప్రాంతంలో పీవోహెచ్, ఆర్‌వోహెచ్, సిక్ లైన్, సరుకు రవాణా రోలింగ్ స్టాక్ కోసం ట్రైన్ ఎగ్జామినేషన్ సౌకర్యాలతో 'మెగా ఫ్రైట్ మెయింటెన్స్ డిపో' ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల యువత సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తోంది. పనులు వేగవంతం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతోంది.

రైల్వేశాఖ ఉత్తర్వుల మేరకు వరంగల్, మహబూబాబాద్ మధ్య మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు కోసం రూ.908.15 కోట్లను రైల్వేశాఖ కేటాయించింది. అంతేకాకుండా సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోని డోర్నకల్‌లో సరుకు రవాణా రైళ్లను పరీక్షించే సౌకర్యాలను పెంచేందుకు కవర్‌షెడ్లు, సిమెంటు కాంక్రీట్‌తో రైలు పట్టాలు (బాలెస్ట్ లెస్ ట్రాక్) ఏర్పాటు కోసం రూ.48 కోట్లు కేటాయించింది. ఈ ప్రాంతంలో మెగా ఫ్రైట్ మెయింటెన్స్ డిపో ఏర్పాటు కోసం 300 ఎకరాల స్థల సేకరణ, ప్రాజెక్టు ప్రణాళిక బడ్జెట్ ప్రతిపాదనలు చేపట్టి నివేదిక ఇవ్వాలని కేంద్రం రైల్వే ఉన్నతాధికారులు దక్షిణమధ్య రైల్వే అధికారులకు ఉత్తర్వులు పంపారు. ఈ మెగా రైల్వే ప్రాజెక్టు ఇక్కడ ఏర్పాటైతే ప్రత్యక్షంగా వెయ్యి నుంచి 1500 మందికి, పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి లభించనుంది. దీంతో జిల్లాకు చెందిన పలు వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

'మెగా మెయింటెన్స్ ఫ్రైట్ డిపో' అంటే...

స్థూలంగా చెప్పాలంటే సరుకు రవాణా రైళ్ల (ఫ్రైట్ ట్రైన్స్) కోసం పూర్తిస్థాయి పరిశీలన, మరమ్మతులు, నిర్వహణ చేయడానికి అవసరమైన సౌకర్యాలతో కూడిన పెద్ద కేంద్రాన్ని 'మెగా మెయింటెన్స్ ఫ్రైట్ డిపో'ను అంటారు. రోలింగ్‌స్టాక్ అంటే రైలు పట్టాలపై కదులుతూ.. ఉండే లోకోమోటివ్ ఇంజన్‌లు ప్రయాణికుల బోగీలు, సరుకు వ్యాగన్లు, ట్రాక్‌మెయింటెనెన్స్ వాహనాలు, ఇన్‌స్పెక్షన్‌కార్‌లు, క్రేన్ వంటి స్పెషల్ వెహికిల్‌లు ఈ విభాగంలో ఉంటాయి. ఇందులో పీవోహెచ్, ఆర్‌వోహెచ్, సిక్‌లైన్, సరుకు రవాణా రోలింగ్ స్టాక్ కోసం ట్రైన్ ఎగ్జామినేషన్ సౌకర్యాలుంటాయి. పిరియాడిక్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) విభాగంలో రైల్వే బోగీలు, వాగన్లు, ఇంజన్లు పూర్తి తనిఖీతో మరమ్మతు చేసే ప్రక్రియను నిర్వహిస్తారు. వ్యాగిన్లు, ఇంజన్లు ఏడాదిన్నర లేదా నిర్దిష్ట కిలోమీటర్లు నడిచిన తర్వాత ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. ఇందులో భాగంగా బ్రేకులు, బేరింగులు, సస్పెన్షన్, కప్లింగ్‌లు తదితర పరికరాలను పూర్తిగా పరిశీలించి, పనికి రానివి ఉంటే కొత్తవి మారుస్తారు. రొటీన్ ఓవర్ హాలింగ్ (ఆర్‌వోహెచ్) ఇది రైల్వే వ్యాగన్లు నిరంతరం సురక్షితంగా నడవడానికి అవసరమైన చిన్న రిపేర్లు, గ్రీసింగ్, ఆయిల్ మార్పులు తదితర సాధారణ రొటీన్ చెకప్‌లు ఇందులో చేస్తారు. 'సిక్‌లైన్' అంటే పాడైన, ధ్వంసమైన రైళ్లు, బోగీలను నిలిపి మరమ్మతులు చేసే ప్రాంతం. ఇది రైల్వేస్టేషన్‌కు దగ్గరగా ఏర్పాటు చేస్తారు. ఇక్కడ చిన్న నుంచి మధ్యస్థ తరహా మరమ్మతులు చేస్తారు. చివరిది 'ట్రైన్ ఎగ్జామిన్ ఫెసిలిటీస్' అంటే రైలు బయలుదేరే ముందు పూర్తిగా చెక్‌చేసే సదుపాయాలు ఉంటాయి. రైలు బ్రేకులు, వీల్ బేరింగులు, కప్లింగులు, లైటింగ్, సిగ్నలింగ్ తదితర అన్నీ వ్యవస్థలను పరిశీలించే సౌకర్యాలుంటాయి. దీని వల్ల సరుకు రవాణా రైళ్లు సురక్షితంగా సమయానికి నడుస్తాయి.


తాళ్లపూసపల్లి సమీపంలో లోకోమోటివ్ పీవోహెచ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న రైల్వే భూమి


గతంలో భూపాలపల్లిలో శిక్షణ పొందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ టీం

సేవా స్కౌట్లు ఎక్కడ..?

కుంటుపడిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

- కొరవడుతున్న దేశభక్తి, సేవాభావం
- పెడదారిపడుతున్న యువత

భూపాలపల్లిటౌన్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, దేశ సేవ అందించే సేవా స్కౌట్ల మనుగడ ఎక్కడ అనే ప్రశ్న పలువురి మదిలో మెదులుతోంది. రాను రాను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు కుంటుపడిపోతున్నాయి. అంతేకాదు.. యువతీయువకుల్లో దేశభక్తి, సేవాభావం పెంచే నాథులే లేకుండా పోతున్నారు. వెరసి యువత పెడదారి పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

చిన్న వయస్సు నుంచే బాలబాలికల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవాభావం, మానవతా విలువలు నేర్పించేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ పనిచేస్తుంది. ఇది పూర్తిగా ఉచిత సేవలు అందించే స్వచ్ఛంద సంస్థ. దీనిని బాలబాట ఉద్యమం అని కూడా అంటారు. బాలుర బృందాలను స్కౌట్స్ బాలికల బృందాలను గైడ్స్ అంటారు. ఈ ఉద్యమాన్ని సర్ రాబర్ట్ బెడన్ పవల్ 1907లో దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధాల్లో గాయపడిన వారికి సేవ చేయడానికి ప్రారంభమైంది. దేశంలోని నిరక్షరాస్యతను నిర్మూలించడమే కాకుండా, విపత్తులు సంభవించినప్పుడు, ప్రజలు ఆపద సమయాల్లో ఉన్నప్పుడు ఆదుకునే సేవలు చేయడం, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అనేక కార్యక్రమాలు చేపడతారు. వీరికి ఆయుధాలు లేకుండా కర్రను మాత్రమే ధరించి ఈతకొట్టడం, వంతెనలు ఎక్కడం, ప్రథమ చికిత్స వంటి శిక్షణలు కూడా పొందుతారు. ప్రత్యేక దుస్తులు ధరించడం, టీంకు ఒక లీడర్ ఉండడం వీరి ప్రత్యేకత.

నిర్వహణ వీరిదే..

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ టీంకు గాను తెలంగాణ రాష్ట్రంలో చీఫ్ కమిషనర్‌గా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, గవర్నర్‌గా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి ఉంటారు. అలాగే జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షుడుగా, జిల్లా విద్యాశాఖ అధికారి చీఫ్ కమిషనర్‌గా ఉంటారు. అయితే కొంతకాలంగా దీని గురించి పట్టించుకున్న నాథులే కరువయ్యారు. దీనికి సంబంధించిన కార్యక్రమాలు సైతం కనుమరుగయ్యాయి. యువతలో క్రమశిక్షణ మాట అటుంచితే.. దేశభక్తి పూర్తిగా కోల్పోయే దుస్థితి దాపురించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

సింగరేణిలో

భూపాలపల్లి జిల్లా అంటేనే సింగరేణి బొగ్గు గనులు. ఇక్కడ గత ఐదేళ్ల క్రితం స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఎంతో చురుగ్గా సాగేవి. గనుల్లో ఏ ప్రమాదం జరిగినా.. వారికి వారివంతు సహాయాన్ని అందించేవారు. అలాగే విపత్తులు జరిగి నప్పుడు మేం ఉన్నామంటూ.. ముందుకు వచ్చేవారు. వివిధ రకాల సేవా కార్యక్రమాలు జరిగేవి. జిల్లాలో రైతుల ఆత్మహత్యలు ఆపేందుకు తనవంతు బాధ్యతగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

వయోజన విద్య, ప్రభుత్వ పథకాలపై అవగాహన, ఎయిడ్స్ నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. దీనికి గతంలో ఇక్కడ సింగరేణిలో పనిచేసిన శ్రీనివాస్ అనే డిస్ట్రిక్ట్ లీడర్ ఇలా చాలా సేవా కార్యక్రమాలు నిర్వహించి తనదైన శైలిని చాటుకున్నారు. కానీ ఇప్పుడు పూర్తిగా కుంటుపడ్డాయి. సింగరేణిలో పనిచేసే కార్మి కుల పిల్లలతో పాటు ఇతర పిల్లలు సైతం మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తీరని నష్టా లను చవిచూస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

గతంలో ఇక్కడ 12యూనిట్లు నడిచేవి. కానీ ఇప్పుడు ఒకే ఒక యూనిట్ మాత్రమే యాక్టివ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ ఒక్క యూనిట్‌లో 32 మంది సభ్యులు ఉంటారు. దీంతో ప్రజలకు సరైన సేవలు అందడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అలాగే ప్రాంత ప్రజల నోట తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఆరుగురికి ప్రాణంపోసి.. తాను కన్నుమూసి..

- హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్ డెడ్
- అవయవాల దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు
- మృతుడు జనగామ జిల్లా వాసి
- మండేలగూడెంలో యుగంధర్‌కు కన్నీటి వీడ్కోలు



గాదె యుగంధర్(ఫైల్)

మండేలగూడెంలో గాదె యుగంధర్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు తదితరులు

రఘునాథపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తాను కన్నుమూస్తూ మరో ఆరుగురి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాడు.. దసరా పండక్కి ఇంటికి వచ్చి హైదరాబాద్ వెళ్తుండగా యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బ్రెయిన్ డెడ్ అవడంతో పుట్టెడు బాధలో కన్నీటిని దిగమింగి.. కుమారుడి అవయవదానికి తల్లిదండ్రులు ముందుకువచ్చారు. గురువారం అశ్రునయనాల మధ్య జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండేలగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.

గాదె మురళీధర్-శోభ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు గాదె యుగంధర్ (29) హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండక్కి స్వగ్రామానికి వచ్చిన యుగంధర్ ఈనెల 5న ఆదివారం సాయంత్రం తన మేనబావ చందుతో బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. రామంతపూర్ సమీపంలో కంట్లో దుమ్ము పడుతుందని కంటి అద్దాలు పెట్టుకుంటుండగా, ఎదురుగా మరో వాహనం రావడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉప్పల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి మరుసటి రోజు (సోమవారం) సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు చికిత్స అందించిన వైద్యులు బుధవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. అవయవాలు దానం చేసి ప్రాణదానం చేయాలని వైద్యులు కోరడంతో యుగంధర్ తల్లిదండ్రులు పుట్టెడు బాధలోనూ ఆరు అవయవాల దానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కళ్ల వేరు చేసి అపోలో, కిమ్స్ తదితర ఆస్పత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి కోసం గ్రీన్ ఛానల్ మార్గంలో తరలించి ఆరుగురు రోగులకు అమర్చారు. అనంతరం మృతదేహాన్ని గురువారం మండేలగూడెం తరలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే యుగంధర్ అయిదు రోజుల వ్యవధిలోనే విగతజీవిగా మారడాన్ని బంధువులతో పాటు గ్రామస్థులు జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, మజీ జడ్పీటీసీలు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, బొల్లం అజయ్‌మణికంఠ నివాళులర్పించారు.

కేయూ తెలుగు పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు రద్దు?

పారదర్శకంగా జరగకపోవడమే కారణం

కేయూ క్యాంపస్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఇటీవల నిర్వహించిన పీహెచ్‌డీ అడ్మిషన్ల ఇంటర్వ్యూల ప్రక్రియ రద్దుకు రంగం సిద్ధమైంది. యూజీసీ నిబంధనల మేరకు ఇటీవల సోషల్ సైన్స్, ఆర్ట్స్, సైన్స్‌తో పాటు ఇతర విభాగాల్లో ఖాళీలకు అనుగుణంగా ఆయా విభాగాల డీన్లు నోటిఫికేషన్లు జారీ చేశారు. అయితే ఆర్ట్స్ ఫ్యాకల్టీలో తెలుగు విభాగంలో 4 సీట్లకు అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను వెలువరించారు. తెలుగు విభాగంలో 4 సీట్లకు 30 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 11మంది జేఆర్‌ఎఫ్ (జూనియర్ రిసెర్చ్ ఫెల్లోషిప్ యూజీసీ న్యూఢిల్లీ) పొందిన వారుండగా మరో 19మంది జాతీయ స్థాయి నెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారున్నారు. అయితే ఇంటర్వ్యూలకు జేఆర్‌ఎఫ్ అర్హత కలిగిన ఒక్కరు, నెట్ అర్హత కలిగిన ఇద్దరు గైర్హాజరయ్యారు.

నిబంధనల మేరకు జాతీయ స్థాయిలో ఫెల్లోషిప్, నెట్, స్లెట్ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఫెల్లోషిప్‌లో జేఆర్‌ఎఫ్, నెట్, స్లెట్‌తో పాటు యూజీ, పీజీ, ఎంఫిల్, పరిశోధన పత్రాలకు మార్కుల వెయిటేజీలో మొత్తంగా అభ్యర్థుల తుది మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలకు వర్సిటీతో పాటు ఇతర వర్సిటీకి చెందిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లు ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా 10 మార్కులను కేటాయిస్తారు.

అయితే నిబంధనల మేరకు తెలుగు విభాగంలో ఇంటర్వ్యూ ప్రక్రియ సక్రమంగా జరుగలేదని వర్సిటీ ఉన్నతాధికారులు గుర్తించారు. మెరిట్‌కు అన్యాయం జరిగిందని అనర్హులను ఎంపిక చేసినట్లు గుర్తించారు. నిబంధనలను అతిక్రమించి అనర్హులను ఎంపిక చేయడం పట్ల వర్సిటీ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడంపై విస్మయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఏ ప్రతిపాదికన అభ్యర్థులను ఎంపిక చేశారనే అంశం చర్చనీయాంశంగా మారింది. తెలుగు విభాగంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి పారదర్శకంగా అడ్మిషన్ల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పిక్కలు పీకుతున్న వీధి కుక్కలు

- నగరంలో ఎక్కడ చూసినా భౌభౌల స్వైర విహారం
- గ్రేటర్ పరిధిలో 37.625 వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా
- ఒకే రోజు చింతల్‌లో 18 మందిపై కుక్కల దాడి
- చింతగట్టు ఏబీసీ సెంటర్ కేంద్రంగా సిబ్బంది సేవలు
- ప్రతిపాదించిన మరో ఏబీసీ సెంటర్ మాటే లేదు



వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్‌లలో ఎక్కడ చూసినా మందలకొద్ది వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో కుక్కల అరుపులకు కాలనీల ప్రజలు జాగారం చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం 5 గంటల సమయంలో ప్రత్యేక అరుపులను సాగదీస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాదచారులు రోడ్లపై నడవాలంటే వీధికుక్కలతో భయాందోళనలకు గురవుతున్నారు. ఐదేళ్లగా వరంగల్ ట్రైసిటీస్‌లో వీధి కుక్కల సమస్య తీవ్రతరంగా మారుతోంది. కాలనీలలో స్వేచ్ఛగా తిరుగుతున్న కుక్కలు.. నగర ప్రజలపై దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో ఇటీవల చింతల్ ప్రాంతంలో ఒకే రోజు 18 మందిపై వీధి కుక్క దాడి చేసినా ఇప్పటివరకు ఆ ప్రాంతంలో కుక్కలు పట్టడానికి స్పెషల్ డ్రైవ్ చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సమయాల్లో వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కుక్కకాటు కేసులు ఎంజీఎంతో పాటు సంబంధిత పీహెచ్‌సీలకు వస్తున్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. కొందరికి సరైన సమయానికి యాంటీ రేబిస్ ఇంజక్షన్లు అందక మరణిస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా స్కూళ్లకు వెళ్లే పిల్లలు, తల్లులు కుక్కకాటుకు గురవుతున్నారు. కొన్ని చోట్ల వీధి కుక్కలు చర్మ సంబంధ వ్యాధుల బారిన పడి ప్రజల మధ్య సంచరిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చావుదశకు చేరిన వీధి కుక్కలను సుదూర ప్రదేశాలకు తరలించి డిస్పోజల్ చేయాలని సీడబ్ల్యూఎంసీ అధికారులు ఆశిస్తున్నప్పటికీ కొందరు జంతు ప్రేమికులు చట్టాలు, సెక్షన్లు చూపిస్తుండడంతో ఏం చేయలేక చేతులెత్తేస్తున్నట్టు బల్దియా వెటర్నరీ సిబ్బంది తెలిపారు.

బల్దియా వ్యాప్తంగా 37,625 శునకాలు

గ్రేటర్ వరంగల్ 66డివిజన్‌ల పరిధిలోని విలీన గ్రామాలను కలుపుకుని 2025 మార్చి వరకు మై ఎనిమల్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ చెప్పిన లెక్కల ప్రకారం 37,625వీధి కుక్కలు సంచరిస్తున్నట్టు వెల్లడించారు. కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్ర ఆపరేషన్లు చేసినా రెండేళ్లలో కొన్ని మరణించగా, మరో పది వేలు వృద్ధి చెందినట్టు తెలిసింది. చింతగట్టు ఏబీసీ (ఎనిమిల్ బర్త్ కంట్రోల్ సెంటర్) వద్ద ప్రతీ రోజుకు 25 కుక్కల చొప్పున అర్హత కలిగిన పశువుల డాక్టర్లు కుక్కల సంతాన వృద్ధి నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్లు, 5గురు హెల్పర్లు ఒక కుక్క ఆపరేషన్ కోసం అరగంట కష్టపడి అన్ని జాగ్రత్తలతో శస్త్రచికిత్స చేస్తున్నారు. అక్కడ పని చేసే 12 మంది బిహారీలు నగరంలో వీధికుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నారు.ఇప్పటి వరకు 8ఏళ్లకాలంలో సుమారు 25వేల వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేష న్లు చేసినట్టు అధికారులు వెల్లడించారు. బల్దియా సంబంధిత అధికారులు వీధి కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నప్పటికీ ఆడ శునకం ఏటా రెండు ఈతలు చేయగా, ఒక ఈత (ప్రసవం)లో కనీసం 5నుంచి 8 పిల్లలు చేస్తుంది. పిల్లలు సైతం ఆరు మాసాలకే ఎదకురావడం అవి కూడా పిల్లలు పెట్టడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో కుక్కలు వృద్ధి చెంది జనావాసాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని డాక్టర్లు చెప్పుకొస్తున్నారు. వర్షాకాలంలో కుక్కలు ఎక్కువ మొత్తంగా క్రాసింగ్ జరగడం వల్ల తిరిగి వర్షాకాలం వచ్చే సరికి వందల సంఖ్యలో వీధి కుక్కలు బయటకు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వీధి కుక్కలు గడ్డివాములు, చెట్ల పొదలు, వదిలేసిన పాత ఇళ్లలో ప్రసవించడంవల్ల బర్త్ డేటాను లెక్కించలేకపోతున్నామని డాక్టర్లు చెబుతున్నారు.

రెండో ఏబీసీ సెంటర్ మాటే ఎత్తరు

గ్రేటర్ వరంగల్ నగర పాలం సంస్థ ఆధ్వర్యంలో చింతగట్టు కెనాల్ ప్రాంతంలో ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) 2018లో ఏర్పాటు చేసి అక్కడి నుంచే కుక్కల సంతాన నియంత్రణ చేస్తున్నారు. నగర ప్రజలు కుక్కకాటుకు గురికావడం పట్ల చాలామంది ఫిర్యాదులు చేయడంతో సెంట్రల్ గవర్నమెంట్ స్కీం కింద రాష్ట్రంలో నాలుగు ఏబీసీ సెంటర్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలలో రెండేసి సెంటర్లు ఏర్పాటు చేశారు. కాని 14 లక్షల జనాభా కలిగిన వరంగల్ నగరంలో ఒక్క ఏబీసీ సెంటర్ సేవలందించలేకపోతున్నారు. స్వతంత్ర యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రస్తుతం వరంగల్ సీడబ్ల్యూఎంసీ వీధి కుక్కల నియంత్రణ కాంట్రాక్ట్ పొందింది. వీరు రోజుకు 50కుక్కలను పట్టుకొచ్చినా 10 నుంచి 20 కుక్కలకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతున్నాయి. చాలా కుక్కలు ఆకలితో అలమటిస్తూ కొన్ని అక్కడే మృత్యువాత పడుతున్నాయి. ఒక కుక్కను పట్టుకున్నది మొదలు ఆపరేషన్ చేసి తిరిగి యదాస్థానానికి వదిలి వేసే వరకు రూ.800 వరకు ఇస్తున్నారు. ఐదేళ్ల కిందట మరో ఏబీసీ సెంటర్‌ను ఏనుమాముల ప్రాంతంలో ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఆచరణ అసాధ్యం అవుతోంది. పాలకవర్గం, కమిషనర్ ఇతర విభాగాలపై పెట్టిన దృష్టి.. కుక్కలు, కోతుల నియంత్రణపై పెట్టాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల సమాచారం ఇవ్వండి ఇలా..



బల్దియా పరిధిలో ఎక్కడైనా ప్రజలపై కుక్కలు దాడి చేసినా, కరిచినా బాధితులు జీడబ్ల్యూ ఎంసీ సిబ్బందికి సమాచారం ఇస్తే తక్షణమే పరిష్కారం జరుగుతుందని చెప్పుకొస్తు న్నారు. ముందుగా స్థానిక మున్సిపల్ జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, వెటర్నరీ డాక్టర్, సీఎంహెచ్‌వోకు ఫోన్‌లో సమాచారం ఇవ్వవచ్చు. వాట్సాప్‌లో తెలుపవచ్చు. లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1800 425 1980, 9701999689, 8919130853, ఆరోగ్య శాఖ టోల్ ఫ్రీ నెంబరు 104, ఆస్పత్రి అత్యవసర సేవలు 108 నెంబర్‌లకు ఫోన్ చేయవచ్చు. ప్రజల ఫిర్యాదులు స్వీకరించి న అధికారులు.. వెంటనే సంబంధిత ప్రదేశానికి అక్క డి మున్సిపల్ జవాన్‌ల సహా యంతో బిహార్ యువకులు ప్రత్యేక వాహనాలలో చేరుకుని వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తారు. వాటి సంతాన నియంత్రణ ఆపరేషన్‌లు పూర్తి చేసిన తర్వాత ఎక్కడ నుంచి పట్టుకున్నారో అక్కడే వదిలేస్తామని మునిసిపల్ వెటర్నరి అధికారి తెలిపారు.



పొగాకురహిత ప్రచార ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

పొగాకురహిత సమాజమే ధ్యేయం

డీఎంహెచ్‌వో కె.మల్లిఖార్జునరావు

జనగామ కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని డీఎంహెచ్‌వో కె.మల్లిఖార్జునరావు అన్నారు. గురువారం జనగామలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఎన్‌సీడీ క్లినిక్ తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం, ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పొగాకు పదార్థాల వినియోగంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నందున, ప్రతీ ఒక్కరు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు నియంత్రణ చట్టాల అమలుకు జిల్లాలో కనీసం 16 ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. జిల్లాలో శిక్షణ కార్యక్రమం నిర్వహించి పాఠశాల ఉపాధ్యాయులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు పొగాకు నియంత్రణ చర్యలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ క్లినిక్ వైద్యాధికారి కీర్తన, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటి సీపీఎం నాయకుల సమ్మేళనం



ఇప్పగూడెంలో కలుసుకున్న రెండు దశాబ్దాల క్రితం నాటి నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇప్పగూడెంలో 1980 నుంచి 2000 సంవత్సరం వరకు సీపీఎం పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన నాయకుల సమ్మేళనం గురువారం నిర్వహించారు. అప్పటి సీపీఎం నేత, ప్రస్తుత నాయకుడు దైద ఎలిషన్ ఆధ్వర్యంలో ఒకే చోట కలుసుకొని అనాటి రాజకీయ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. రెండు దశాబ్దాల పాటు సీపీఎం పార్టీలో డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిలో పనిచేసిన నాయకులు ఒకే చోట కలుసుకునే అవకాశం రావడంపై నాయకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దైద ఎలిషన్, బొట్ల శ్రీనివాస్, ఉడుత రవి, గట్ల కొండల్ రెడ్డి, లక్ష్మణ్, వెంకటస్వామి, కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గ్రామంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పాలకుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను విస్తృత ప్రచారం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కోరారు. గురువారం పెద్దతండా(బీ) శివారులోని దుబ్బతండాలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కృషితో ఇప్పటి వరకు నిరుపేదలందరి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేశారని తెలిపారు. సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, పంట రుణాల మాఫీ లాంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. సమావేశంలో నాయకులు మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచు పోగు శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

12 ఏళ్ల నాటి కేసులో నిందితుడి అరెస్ట్

కేసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన 12 ఏళ్ల నాటి కేసులో ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితున్ని కేసముద్రం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ కాంత్రికిరణ్ తెలిపిన ప్రకారం. మండలంలోని కాట్రపల్లికి చెందిన బానోత్ మంగుపై 2013లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసులో 2019 నుంచి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న నిందితునిపై నాన్ బేయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ మేరకు మంగును పట్టుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

హైకోర్టు స్టేతో ఆగిపోయిన ఎన్నికల ప్రక్రియ



కోర్టు స్టే రావడడంతో ట్రంక్ పెట్టెల్లో సామగ్రిని సర్దుతున్న సిబ్బంది



ఆర్వో కార్యాలయంలో అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఉత్కంటగా ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఎన్నికల పైన హైకోర్టు స్టే విధించడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. సోమవారం స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఆర్వో రాణాప్రతాప్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలో 9ఎంపీటీసీ స్థానాలు ఉండగా మూడు ఎంపీటీసీ స్థానాలకు ఆర్వో, ఏఆర్వోలను ఏర్పాటు చేశారు. 9స్థానాలకు మూడు కౌంటర్లను ఏర్పాటు చేసి నామినేషన్ల స్వీకరణకు అధికారులు సిద్ధపడ్డారు.

ఉదయం 11నుంచి సాయంత్రం వరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. సాయంత్రం 4:30 గంటలకు ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వడంతో సామగ్రిని ట్రంక్ పెట్టెల్లో పెట్టి కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రపరిచారు. కాగా, ఆర్వో కార్యాలయాన్ని డీసీపీ రాజమహేంద్రనాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో వెంకన్నలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, ఎస్సైలు వినయ్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

27వసారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రంజిత్‌రెడ్డి

చిలుపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పుట్టినరోజు, పెళ్లి రోజు పురస్కరించుకుని ఏళ్ల నుంచి రక్తదానం చేస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలేపల్లి రంజిత్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. గురువారం తన 43వ పుట్టినరోజును పురస్కరించుకుని హనుమకొండలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో మరోసారి రక్తదానం చేశారు. దీంతో కలిపి ఇప్పటివరకు 27 సార్లు రక్తదానం చేయడం విశేషం.

పాఠశాలకు మౌలిక వసతులు



వసతులతో నిర్మించిన గదిని ప్రారంభిస్తున్న దాత కుటుంబం

బచ్చన్నపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పోచన్నపేట పాఠశాలలో రూ.4.50 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు వచ్చారు. వీటితో పలు రకాల వసతులను విద్యార్థులకు కల్పించనున్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ముక్తవరం కరంచంద్ ముక్తి తన అమ్మమ్మ ఊరైన పోచన్నపేట పాఠశాలకు ఏదైనాసాయం అందించాలనే లక్ష్యంతో డబ్బులు దశలవారీగా అందించారు. గురువారం వసతులు కల్పించిన గదికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ఇలాంటి కార్యక్రమాలతో ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు వసుమతి, శివాజీ, ఝాన్సీ, హైందవి, హెచ్‌ఎం హరిశంకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతర పోరు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సీపీఎం టూటౌన్ ఏరియా కమిటీ సమావేశాన్ని గురువారం ఇల్లుటూరి లాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు.

ఆరోగ్యవంత సమాజమే లక్ష్యం



వడ్లకొండలో మాట్లాడుతున్న సీడీపీవో సత్యవతి

జనగామ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం పోషణపక్షం నిర్వహిస్తున్నామని, పోషకాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జనగామ సీడీపీవో వి. సత్యవతి అన్నారు. వడ్లకొండ, చీటకోడూరు గ్రామాల్లో గురువారం పోషణమాసం నిర్వహించారు. వడ్లకొండ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆకుకూరలు, ఐరన్, జింక్ ఉపయోగాలు, ఉప్పు, చక్కెర అధిక వాడకంతో వచ్చే అనర్థాలను వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సర్కిల్ సూపర్‌వైజర్ పి.వసంత, అంగన్‌వాడీ టీచర్లు డి.రాజేశ్వరి, సీహెచ్.రమాదేవి, పి.లక్ష్మీదేవి, ఎ.శారద, జి.లక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు. అలాగే, చీటకోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసంలో అంగన్‌వాడీ టీచర్ చేవూరి లలిత పోషకాహారంపై గర్భిణిలు, బాలింతలకు అవగాహన కల్పించారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



బచ్చన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

బచ్చన్నపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానమన్నారని, కళ్లను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ దృష్టి నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కంటి ప్రాధాన్యతను తెలిపారు. మరణానంతరం కళ్లను దానం చేసి ఇరువురికి చూపు ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అరుణకుమారి, దీప్తి, రాములు, సిద్ది నర్సింగ్, మెడికల్ సిబ్బంది, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



జఫర్‌గడ్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన వేల్పుగొండ లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నేటి(శుక్రవారం)నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను జఫర్‌గడ్‌లోని దేవుని కొండ దిగువన ఉన్న శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అర్చకులు పొడిచేటి వెంకటాచార్యులు తెలిపారు. 10న పుణ్యావహచనం, రక్షాబంధనం, అంకురార్పణ. 11న అగ్నిప్రతిష్ఠ, సుదర్శనారసింహ హోమం, 12న మధ్యాహ్నం కల్యాణోత్సవం, 13న శాంతి హోమం, మహాపూర్ణాహుతి, స్వామి వారికి చక్రస్నానం, శ్రీపుష్పయాగం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.



నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నామినేషన్ల స్వీకరణ కేంద్రం పరిశీలన

చిలుపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలుపూర్‌లోని ఎమ్మార్సీ (మండల విద్యా వనరుల కేంద్రం) భవనంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచుల నిర్వహణకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని గురువారం పరిశీలించారు. మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలతతో మాట్లాడారు. నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, కూరపాటి రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న శ్రీకాంత్, రామోజీ

కొడకండ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మండల అధ్యక్షుడు సిందే రామోజీ పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం కొడకండ్ల పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ స్థానాల కోసం పోటీ అభ్యర్థుల విజ్ఞప్తులను మండల నాయకత్వం పరిశీలించింది. శ్రీకాంత్, రామోజీలు మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది ఎంపీటీసీ స్థానాలతోపాటు జడ్పీటీసీ, ఎంపీపీ సీట్లను కూడా కైవసం చేసుకుంటామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సిఎస్ వైస్ చైర్మన్ మేటి సోమరాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాముతో పాటు పలువురు ఎంపీటీసీ క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హమీద్

బచ్చన్నపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నాయని ఎస్ఐ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం సైబర్ నేరాలపై మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాధారణ బెదిరింపులు, సురక్షితమైన ఆన్‌లైన్ పద్ధతులపై, అనుమానాస్పద కార్యక్రమాలకు స్పందించే మార్గాలపై వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉపాధిలో పారదర్శకత

(3వ పేజీ తరువాయి)



కూనూరులో కూలీ ముఖచిత్రాన్ని మొబైల్‌లో చిత్రీకరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

కన్నా ఎక్కువ మంది నమోదుతో పాటు ఒకరికి బదులు మరొకరు పని చేశారనే ఆరోపణలు వచ్చాయి. తక్కువ, చెల్లింపులు ఎక్కువగా చేసినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. బినామీల నియంత్రణ, డబ్బుల చెల్లింపుల ప్రక్రియను మరింత కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. సాంకేతికతతో కూలీల ముఖ గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది .

పని ప్రదేశంలో రెండు పూటలా ఫొటోలు..

కూలీల హాజరు పక్కాగా ఉండేందుకు ప్రస్తుతం ఉపాధి కమ్యూనిటీ పనుల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. హాజరు విధానం దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం ఈ నూతన విధానాన్ని తీసుకువచ్చింది. పని ప్రదేశంలో కూలీల ఫొటోలను రెండు పూటలా తీసి అప్‌లోడ్ చేస్తేనే కూలీలకు పూర్తి కూలి అందనుంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని క్షేత్ర సహాయక సిబ్బంది చెబుతున్నారు. దీంతో పక్కాగా అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ పద్ధతితో కూలీల ఫేస్ రికగ్నైజేషన్ పద్ధతి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానం ద్వారా కూలీ ముఖ చిత్రం లేదా కళ్ల ఫొటోలను యాప్‌లో డౌన్‌లోడ్ అనంతరం ఆన్‌లైన్‌లో కూలీల వివరాలు పక్కాగా నిక్షిప్తమై ఉంటాయి. పని ప్రదేశంలో కూలీ ఫొటో తీసిన వెంటనే ఎలాంటి సాంకేతిక సమస్య లేకుండా ఆ కూలీ ఫొటోతో పాటు వివరాలన్ని వెల్లడవుతాయి. దీంతో కూలీల హాజరు శాతం పక్కాగా ఉంటుందని, అందుకే ఈకేవైసీ ప్రక్రియను చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధి హామీలో నూతన హాజరు విధానాన్ని కూలీలు వ్యతిరేకిస్తున్నారు. ఈ పద్ధతితో ఉపాధి పనులకు హాజరయ్యే వారి శాతం తగ్గిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పెద్దవంగర మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజమెత్తారు. పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక మూడున్నరేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నుడుస్తున్నది ప్రజాపాలన కాదని.. పేద ప్రజలను దోచే పాలన నడుస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడంతో పాటు అందురూ భాగస్వాములు కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, ఆ పార్టీ దొంగ హామీలను ప్రజల్లో ఎండగట్టేది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడపకూ వివరించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్య, యాదగిరిరావు, శ్రీరాం సంజయ్, సమ్మయ్య, వెంకన్న, రాము, అశోక్, రవి, వెంట్రామయ్య, రాము, శ్రీనివాస్, పటేల్, భాస్కర్, రాజేందర్, రాము, గంగాధర్, కుమార్, రఘు, హరీష్, వేణు, సతీష్, రాంమూర్తి, అనిల్, మహేష్, సుభాష్, అనుదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

ఎన్నికల్లో బీఎస్పీ సత్తాచాటుదాం..

జనగామ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాడి రాజు అన్నారు. గురువారం కాన్షీ రాం 19వ వర్ధంతి సందర్భంగా జనగామలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా రాజు ముఖ్య అతిథిగా హాజరై కాన్షీ రాం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో దేశంలో సామాజిక న్యాయం ప్రశ్నార్థకమైందన్నారు. సామాన్య ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు రావాలంటే దళితులు, బీసీలు, మైనారిటీలు రాజకీయ అధికారాన్ని చేపట్టడం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి జేరిపోతుల మల్లయ్య, ఉపాధ్యక్షుడు నారబోయిన రాజు, తాండ్ర అఖిల్, గువ్వల భిక్షపతి, తాండ్ర లావణ్య, మబ్బు ఉదయ్ పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

జఫర్‌గడ్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య అన్నారు. సాగరంలో గురువారం జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం ప్రతినిధులకు ఓటేసి గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు నక్క యాకయ్య, కొమురయ్య, రమేశ్, యాకన్న, బానాల రవి, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య



పాలకుర్తిలో మాట్లాడుతున్న కనకారెడ్డి

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

పాలకుర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కనకారెడ్డి మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన గడ్డపై సీపీఎంకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. బూర్జువా, భూస్వామ్య పార్టీల పాలనను చూశారని, మళ్లీ ఈ ప్రాంతంలో సీపీఎం పూర్వ వైభవం కోసం చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏదునూరి మదార్, మాచెర్ల సారయ్య, చిట్యాల సోమన్న, సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, బచ్చు శ్రీలత, కౌడగాని మల్లేష్, కాకర్ల రమేష్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : జనగామ
Jangaon ACO - 9985425870,
Jangaon - 1 SR - 9963609296,
St. Ghanpur - SR - 9652383080,
ACM - 9985411664